ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యా శాఖ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు దసరా సెలవులు ఇవ్వకుండా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న పట్టణంలోని ప్రయివేట్ పాఠశాలలపై స్వయానా కలెక్టర్ స్పందించి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేతినాగేశ్వర డిమాండ్ చేశారు. పట్టణంలో దసరా సెలవులు ఇవ్వకుండా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న పలు పాఠశాలలను మంగళవారం వారు ముయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుండి 24వ తేదీ వరకు పాఠశాల నిబంధనలు ప్రకారం విద్యార్థులుకు దసరా సెలవులు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. తరగతులు నిర్వహించడం వెనుక జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, రాజంపేట ఎంఇఒ నాలుగు రోజుల నుండి విద్యార్థుల స్వేచ్ఛను హరింప చేస్తూ ప్రయివేట్ పాఠశాలలపై అనేక సార్లు పిర్యాదు చేసినా స్పందించకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కలెక్టర్ స్పందించి బాధ్యులైన రాజంపేట ఎంఇఒలను, జిల్లా విద్యాశాఖ అధికారిని ప్రభుత్వానికి సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, పిడిఎస్‌యు పట్టణ నాయకులు హరి, నితిన్, మహేష్, బాలు, రాజ్ కుమార్, దినేష్ పాల్గొన్నారు.

రాజంపేటలో రాజకీయ వేడి

రాజంపేటలో రాజకీయ వేడెక్కింది. ప్రతిపక్ష టిడిపి పార్లమెంటు అధ్యక్షులుగా ప్రముఖ విద్యావేత్త చమర్తి జగన్మోహన్ రాజును నియమించడం చర్చనీయాంశంగా మారింది. పార్లమెంట్, అసెంబ్లీ టిక్కెట్లు ఎవరిని వరిస్తాయోనన్న చర్చకు దారితీసింది. ఎవరూ ఊహించని విధంగా అనూహ్యంగా రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులుగా రాజు విద్యాసంస్థల అధినేత జగన్మోహన్ రాజును పార్టీ అధిష్టానం నియమించడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. జగన్మోహన్ రాజును పార్లమెంట్ అధ్యక్షులుగా నియమించడం వెనక తెలుగుదేశం పార్టీ వ్యూహం ఏంటనే చర్చలు జోరుగా సాగుతున్నాయి.

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

జిల్లా అధ్యక్షులుగా 'చమర్తి' నియామకం
అయోమయంలో 'బత్యాల'

అసెంబ్లీ పైనే 'చమర్తి' గురి

రాజంపేట అసెంబ్లీ నుండే పోటీ చేయాలన్న తలంపుతో జగన్మోహన్‌రాజు ఉన్నారు. 2019 ఎన్నికల్లో కూడా టికెట్ ఆశించారు. అప్పట్లో టిక్కెట్ దక్కకపోవడంతో ఆయన కొంత నిరాశ చెందినా పార్టీలో అంకితభావంతో పనిచేస్తూ వచ్చారు. 2024 ఎన్నికల్లో టికెట్ వస్తుందన్న విశ్వాసంతో పార్టీలో చురుగ్గా ఉంటూ వస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయన రాజంపేట అసెంబ్లీ టికెట్ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు నాయకులను, కార్యకర్తలను కలుస్తూ వస్తున్నారు. ఇక్కడి నుంచి ప్రస్తుత అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా ఉన్న బత్యాల చెంగల్రాయుడు కాపు సామాజిక వర్గం నుంచి టికెట్ ఆశిస్తున్నారు. ఇతనితో పాటు జగన్మోహన్ రాజు టికెట్ బరిలో ఉన్నారు. వీరిద్దరి మధ్య అసెంబ్లీ టికెట్ పోరు జరుగుతోంది. ఈ తరుణంలో జనసేన-టిడిపి పొత్తులో రాజంపేట జనసేనకేమైనా కేటాయిస్తారా అన్న అభిప్రాయాలు వ్యక్తమతున్నాయి. ఇలా రకరకాల చర్చలు జరుగుతున్న తరుణంలో తెలుగుదేశం పార్టీ నుంచి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేయాలన్న దృష్టితో జగన్మోహన్ రాజును పార్లమెంట్ అధ్యక్షులుగా నియమించడం ఊహకందని పరిణామంగా మారింది. ప్రస్తుతం రాజంపేట అసెంబ్లీ, పార్లమెంట్ టికెట్‌లపై చర్చలు వేడెక్కాయి. పార్లమెంట్ అభ్యర్థిగా ఇప్పటికే గంటా నరహరిని ఇప్పటికే చంద్రబాబు నాయుడు ప్రకటించిన విషయం తెలిసిందే. కొంతకాలంగా ఆయన పార్లమెంట్ నుంచి పోటీ చేస్తారా లేక అసెంబ్లీపైనే ఆయన కూడా దృష్టి పెట్టారా అన్న చర్చలు జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో పార్లమెంట్ అధ్యక్షులుగా జగన్మోహన్‌రాజును నియమించడం ఆసక్తికరంగా మారింది. రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులుగా ఇప్పటి వరకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి కొనసాగుతూ వచ్చారు. ఆయన్ను ఏడాది కిందట కడప పార్లమెంట్ అభ్యర్థిగా చంద్రబాబు నాయుడు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా శ్రీనివాసరెడ్డి సతీమణి మాధవిని కడప అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా నియమించడంతో ఆమె కడప అసెంబ్లీ అభ్యర్థిగా ఖరారు అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమ వుతున్నాయి. ఈ తరుణంలో రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులుగా శ్రీనివాసరెడ్డిని కొనసాగించడం రాబోయే ఎన్నికల దృష్ట్యా ఆయనకు ఇబ్బందిగా ఉంటుందన్న కారణంగా ఆయన స్థానంలో కొత్త అధ్యక్షుడిని నియమించాల్సి వచ్చిందని చెప్పుకోవచ్చు. పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించిన నరహరినే అధ్యక్షులుగా నియమించేందుకు అవకాశం ఉంది. రాజంపేట పార్లమెంట్ స్థానం మొదటి నుంచి కాపు సామాజిక వర్గానికి పట్టు ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని అధ్యక్షునిగా నియమించ వచ్చు. ఇలాంటి పరిస్థితులన్నింటినీ కాకుండా జగన్మోహన్ రాజును పార్లమెంట్ అధ్యక్షులుగా నియమించడం పట్ల టిడిపి వ్యూహం ఏంటనేది చర్చనీయాంశంగా మారింది. ఈ తాజా పరిణామాలు చూస్తుంటే రాజంపేట అసెంబ్లీ, పార్లమెంట్ టికెట్ వ్యవహారంపై రకం రకాల చర్చలకు తావునిస్తున్నాయి.

అధిష్టానం నిర్ణయం మేరకే : 'చమర్తి'

టిడిపి అసెంబ్లీ టికెట్ రేసులో ఉన్న జగన్మోహన్‌రాజును పార్లమెంట్ అధ్యక్షులుగా నియమించడంపై ఆయనను పలకరించగా అధిష్టానం నిర్ణయం మేరకు నడుచుకుంటానని పేర్కొన్నారు. అధిష్టానం తనను పార్లమెంట్ అధ్యక్షులుగా నియమించిందని ,అందుకు తగ్గట్టుగా పనిచేస్తానని పేర్కొన్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి బాధ్యతలు నెరవేరుస్తారని తెలిపారు. పార్టీ నాయకులందరితో సమన్వయంతో ఉంటూ పార్టీ అభివృద్ధికి చేస్తానన్నారు.

చింతపండు ప్రాసెసింగ్ క్లస్టర్‌తో
పది వేల కుటుంబాలకు లబ్ధి

- రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

చింతపండు యూనిట్‌ను ప్రారంభించి పరిశీలిస్తున్న ఎంపీ, కలెక్టర్

ప్రజాశక్తి-కురబలకోట(బి.కొత్తకోట)

కురబలకోట మండలంలో ఏర్పాటు చేసిన చింతపండు ప్రాసెసింగ్ క్లస్టర్ ద్వారా 10 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరనుందని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. మంగళవారం కురబలకోటలో నూతనంగా ఏర్పాటు చేసిన చింతపండు ప్రాసెసింగ్ క్లస్టరును ప్రారంభించారు. కెవైసి నోడల్ ఏజెన్సీగా, డిఆర్‌డిఎ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా, సిఎఫ్‌టిఆర్ఐ టెక్నికల్ ఏజెన్సీగా ఈ క్లస్టర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు ప్రాంతంలో చింతపండు మీద ఆధారపడి బతికే వాళ్ళు చాలా మంది ఉన్నారని చెప్పారు. వారందరి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని చింతపండు ప్రాసెసింగ్ క్లస్టరును అభివృద్ధిపరిస్తే బాగుంటుందని భావించి కేంద్ర ప్రభుత్వ సహకారంతో డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో కురబలకోటలో ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రాజెక్టును రూ.3.52 కోట్లతో ఏర్పాటు చేశామన్నారు. ఈ క్లస్టర్ కురబలకోట, పుంగనూరు, చౌడేపల్లి, రామసముద్రం, సోమల ప్రాంతాలలోని పది వేల కుటుంబాలకు అండదండగా నిలుస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా కురబలకోట, పుంగనూరు, చౌడేపల్లి, రామసముద్రం మండలాలలోని వివిధ సామాజిక వర్గాలకు చెందిన 1377 మహిళలు లబ్ధి పొందుతారని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా విత్తనాలు తీసివేసిన చింతపండు, చింతపండు పేస్టు, చింతపండు క్యాండీ, చింతపండు పౌడర్, తదితర ఉత్పత్తులను తయారు చేసి మార్కెటింగ్ చేస్తారని పేర్కొన్నారు. కలెక్టర్ గిరీష మాట్లాడుతూ సంక్షేమ పథకాలే కాకుండా ఎన్నో అభివృద్ధి పథకాలు చేపడుతూ ప్రతి ఇంటికి రూ.2 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు లబ్ధి చేకూరుతోందని తెలిపారు.ప్రాసెసింగ్ క్లస్టర్ కేంద్ర ప్రభుత్వం స్ఫూర్తి పథకం కింద రూపుదిద్దుకుందని తెలిపారు. ఈ క్లస్టర్ సంవత్సరానికి 40 వేల మెట్రిక్ టన్నుల చింతపండును ఉత్పత్తి చేస్తుందని పేర్కొన్నారు. రూ.100 కోట్ల సంవత్సర ఆదాయం ఉంటుందని, 30 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తుందని ఎస్‌హెచ్‌జి మహిళలకి ఉపాధి లభించనుందని తెలిపారు. అన్నమయ్య, అనంతపురం జిల్లాల నుండి మాత్రమే కాకుండా కర్ణాటకలోని కోలార్, మహారాష్ట్రలోని నాసిక్, ఒడిస్సాలోని సంబల్పూర్, ఛత్తీస్ ఘడ్‌లోని జగదల్పూర్ జిల్లాల నుండి చింతపండు సేకరిస్తామని పేర్కొన్నారు. ఈ క్లస్టర్ ఉత్పత్తులను దేశంలోని వివిధ ప్రాంతాలకు, విదేశాలకు కూడా ఎగుమతి చేస్తామని పేర్కొన్నారు. చింతపండు ఆధారిత కుటుంబాలు ఎంతో లబ్ధి పొందుతాయని తెలిపారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంలో కేవలం హామీలు మాత్రమే ఇచ్చారని, ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకున్నారని తెలిపారు. తంబళ్లపల్లిలోని ప్రతి గ్రామంలో సిసి రోడ్లను ఏర్పాటు చేసిన ఘనత ప్రభుత్వానిదేనని తెలిపారు. కురబ లకోట మండలంలో ఏర్పాటు చేసిన చింతపండు ప్రాసెసింగ్ క్లస్టర్ ద్వారా ఎన్నో కుటుంబాలు లబ్ధి పొందుతాయని, ఈ క్లస్టరును అందరు వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ మాట్లాడుతూ ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, తంబళ్లపల్లి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన చింతపండు ప్రాసెసింగ్ యూనిట్ అందుకు ఒక ఉదాహరణమని తెలిపారు. ఈ యూనిట్‌ని నియోజకవర్గ ప్రజలందరూ ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను లోపాల్లేకుండా చూడాలి : గిరీష

మదనపల్లి : ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-కురబలకోట (మదనపల్లె అర్బన్)

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎటువంటి లోపాలు ఉండకూడదని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. మంగళవారం కురబలకోట మండలం, కనసానివారిపల్లిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో లోపాలు లేకుండా చూసుకోవాలని ఎంపిడిఒ, అధికారులకు ఆదేశించారు. కార్యక్రమానికి ఎన్ని ఒపిలు వస్తున్నాయి, ఎన్ని రకాలు టెస్టులు చేస్తున్నారు, ఎంత మందిని ఆరోగ్యశ్రీ కార్యక్రమానికి రెఫర్ చేస్తున్నారనే వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలంతా ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. **మదనపల్లె అర్బన్:** జగనన్న ఆరోగ్య సురక్ష ఓ బృహత్తర కార్యక్రమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత అన్న నినాదంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు ముంగిటకు తీసుకు వచ్చి,వారికి ఉచిత వైద్యం అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ ప్రమీల, శిబిర నిర్వాహకులు డాక్టర్ అనుపమ, ఎఇ శిరీష, వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, కౌన్సిలర్లు షేక్.కరీముల్లా, రామకృష్ణారెడ్డి, రమణ, శివారెడ్డి, శ్రీనివాసులు, సుగుణ, ఇర్ఫాన్, రఫీ, ఆంజనేయులు, పసుపు రవి పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిడిఒ శేషగిరిరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు అన్నారు. మంగళవారం వెంగంవారిపల్లి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచు జి.శ్రీవాణినవీన్, వైసిపి మండల కన్వీనర్ సదాశివరెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్ రెడ్డి, ఆర్ఐ రమణారెడ్డిలతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్‌ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ దీక్షితారాణి, డాక్టర్ సాయిచరణ్, డాక్టర్ నితీష్ బాబు, డాక్టర్ పి.రాజేశ్వరి, వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. **పీలేరు:** ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా సాగుతూన్న జగనన్న ఆరోగ్య సురక్ష సేవల్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోవాలని పీలేరు సర్పంచ్ షేక్ జీనత్ షఫీ, తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా పీలేరు సచివాలయం ఒకటిలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శివ, కీళు ఎముకల వ్యాధి నిపుణులు డాక్టర్ సందీప్‌కు మార్, స్త్రీవ్యాధి నిపుణులు డాక్టర్ ప్రసన్నలక్ష్మి, డాక్టర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు **గాలివీడు** : ఎగువ గొట్టివీడు సచివాలయంలో మంగళవారం సర్పంచ్ నారే మల్లికార్జున నాయుడు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జల్లా సుదర్శన్‌రెడ్డి వైస్ ఎంపిపి-1 మిట్టపల్లి యదుభుషన్ రెడ్డి, వైస్ ఎంపిపి-2, గాలి శ్రీని వాసులు, మాజీ లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆవుల నాగభూషణ్‌రెడ్డి, నూలివీడు సర్పంచ్ ఉమాపతిరెడ్డి, ఎంపిడిఒ శేఖర్‌నాయక్ పాల్గొన్నారు. **వాల్మీకిపురం :** రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. వాల్మీకిపురం పట్టణం నాయక వీధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆరోగ్య రంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకువచ్చారని, ప్రతి గడపకు కార్పొరేట్ తరహా నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నారని అన్నారు. ప్రజల ఆరోగ్యం, పిల్లల చదువులు, భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిల సహకారంతో వాల్మీకిపురంలో రూ.7కోట్ల నిధులతో కార్పొరేట్ తరహాలో అత్యాధునిక హంగులతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నట్లు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.ఆర్‌బికె చైర్మన్ నీళ్ల భాస్కర్, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీధర్ రాయల్, ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్‌మ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి కృష్ణారావు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-పీలేరు

విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, సమాజానికి ఉపయోగపడే ఓ శక్తిగా ఎదుగుతూ అందరికీ ఆదర్శంగా నిలవాలని అన్నమయ్య జిల్లా ఎస్‌పి కృష్ణారావు తెలిపారు. మంగళవారం పీలేరు అర్బన్ సిఐ మోహన్‌రెడ్డి అధ్యక్షతన స్థానిక ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వేర్వేరుగా ఎస్పీ ట్రాఫిక్ నియమాలు, ప్రమాదాలు, మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన దారులు సీటు బెల్ట్ ధరించి వాహనాలు నడపాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడాలని, ప్రమాదాలు నివారించడం మనచేతుల్లోనే ఉందన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ నుంచి సౌండ్ రప్పిస్తూ డ్రైవింగ్ చేయడం చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. మద్యం, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపరాదని, రెప్పపాటులో జరిగే ప్రమాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. రాయచోటి డిఎస్‌పి మహబూబ్ బాష, అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బోధిషా వలి మాట్లాడుతూ మనం చేసే తప్పు వల్ల మన కుటుంబంతో పాటు ఎదుటి వారి కుటుంబం కూడా బాధపడాల్సి వస్తుందని, మాదకద్రవ్యాలకు బలవ్వకుండా, హెల్మెట్ కూడా ధరించి వాహనాలను నడపాలని సూచించారు. కార్యక్రమంలో రాయచోటి డిఎస్పీ మహబూబ్ బాష, పీలేరు సిఐ మోహన్ రెడ్డి, ఎంజెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు, అన్నమయ్యజిల్లా వ్యవసాయ సలహాదార్లు బోదేషా వలి, సిఎన్‌ఆర్ కళాశాల కరెస్పాండెంట్ విజయ్ భాస్కరరెడ్డి, రేవూరి సుధీర్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్నకలెక్టర్ గిరీష

పరిహారం చెల్లింపులు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లాలోని ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఎన్.హెచ్ 71పరిహారం చెల్లింపులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని ముదివేడు బ్యాలెన్స్ రిజర్వాయర్, ఎన్.హెచ్ 71 భూసేకరణ, పరిహారం చెల్లింపు అంశంపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సంబంధించి మొత్తంగా 1074.63 ఎకరాలు అవసరం కాగా వందశాతం భూసేకరించారని తెలిపారు. వీటిలో మొత్తం పట్టా భూములకు అవార్డ్స్ ప్రక్రియ పూర్తి చేశారన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్రక్రియకు సంబంధించి పూర్తి నివేదికను తయారుచేసి కమిషనర్‌కు పంపేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఎన్‌హెచ్ 71 మదనపల్లి నుంచి పీలేరు జాతీయ రహదారికి సంబంధించి భూసేకరణ పూర్తి అయ్యి ఇప్పటికే అవార్డ్స్ పాస్ చేసిన భూములకు సదరు నిర్వాసితులకు పరిహారం చెల్లింపులను వందశాతం పూర్తి చేయాలన్నారు. అవార్డ్స్ పాస్ అయిన వాటిలో కొంతమంది భూ యజమానులు ఎన్నిసార్లు సమాచారం అందించినా పరిహారం తీసుకొని వెళ్లడం లేదని తహశీల్దార్లు వివరించారు. దీనిపై ఆర్బిట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సంబంధితులకు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్‌డిఒ మురళి, సంబంధిత తహశీల్దార్లు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట : ఎంపీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఎంపీ విస్తృతంగా పర్యటించి పలు ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలో మహిళలకు ఎంపీ, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సొంత నిధులతో 150 కుట్టుమిషన్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఇందిరమ్మ కాలనీలో హెల్త్ సెంటర్ ప్రారంభించారు. నగర పంచాయతీ కార్యాలయంలో కుట్టుమిషన్, తోపుడు బండ్లకు సోలార్ విద్యుత్ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. మహిళలకు అన్ని విధాలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టమన్నారు. ప్రతి మారుమూల గ్రామానికి మౌలిక సదుపాయాలైన మురుగునీటి కాలువలు, సిసి రోడ్లను నిర్మించామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ పిఆర్ మనోహర్, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ కంచి కళ్యాణ్ కుమార్‌రెడ్డి, వైసిపి మండల, టౌన్ కన్వీనర్లు ప్రదీప్‌రెడ్డి, సిఆర్ చిన్నికృష్ణ, నాయకులు భీమ్‌గాని ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఎస్.ఫయాజ్, జివి.రామకృష్ణ, నక్క సంతోష్, జి.చాంద్‌బాషా, శ్రీనివాసులు, సబ్జీ, అయుబ్‌బాషా, నాసర్, అమీర్‌సాబ్, షమీ, టి.జనార్ధన్, షేక్‌ముజీబ్, సంపత్ కోట మొహమ్మద్ సాదిక్, అభిలాష్‌రెడ్డి, సాయి చరణ్, సద్దాం, సల్మాన్ పాకాల అంజమ్మ పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

వినియోగదారులకు వరం విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి-పీలేరు

ప్రత్యేక విద్యుత్ అదాలత్ వినియోగదారులకు వరమని, దీన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని చైర్ పర్సన్ వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి తెలిపారు. ఎపిఎస్‌పిడిసిఎల్ డిఇఇ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎఇ ఎం.మునిచంద్ర మాట్లాడుతూ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యాక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అదాలత్‌కు పీలేరు మండలం నుంచి 4, కలికిరి, ఏర్రావారిపాలెం నుంచి ఒక్కొక్క సమస్యను వినియోగదారులు విద్యుత్ అదాలత్ ద ృష్టికి తీసుకు వచ్చారన్నారు. నాలుగు సమస్యలను వెంటనే పరిష్కరించగా మిగిలిన రెండు సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని విద్యుత్ అదాలత్ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు ఆర్థిక విభాగం సభ్యులు రామమోహన్ రావు, సాంకేతిక విభాగం సభ్యులు ఎస్ఎల్ అంజనీ కుమార్, కన్స్యూమర్ అఫైర్స్ విభాగం సభ్యురాలు గాయం ఈశ్వరమ్మ, పీలేరు డివిజన్ పరిధిలోని పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కలకడ, గుర్రంకొండ, కె.వి.పల్లి, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాలకు చెందిన విద్యుత్ అధికారులు, వినియోగదారులు హాజరయ్యారు.

వినియోగదారునితో మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

జగన్‌మోహన్‌రాజుకు ఘన సన్మానం

టిడిపి జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజును సన్మానిస్తున్న కోటయ్య

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమయ్య జిల్లా నూతన టిడిపి అధ్యక్షులుగా ఎన్నికైన చమర్తి జగన్మోహన్ రాజును మంగ ళవారం శవనవారిపల్లి టిడిపి సీనియర్ నాయకులు మంచాల కోటయ్య నాయుడు జగన్ రాజు క్యాంపు కార్యాలయంలో మర్యా దపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపి శాలవాతో ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా జగన్‌మో హన్‌రాజు మాట్లాడుతూ జిల్లాలో టిడిపి బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్య కర్తలకు ఏ కష్టం వచ్చినా అన్నివేళలా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. రానున్న 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోటయ్య నాయుడుకు సూచించారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం టిడిపి సీనియర్ నేత మంచాల కోటయ్య నాయుడు మాట్లాడుతూ జగన్ మోహన్‌రాజు సారథ్యంలో పార్టీ కోసం సైనికుడిలా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దుగ్గినేని రవీంద్ర, సుబ్బరాజు, సతీష్ రాజు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ను కలిసిన 'చమర్తి'

ప్రజాశక్తి - రాయచోటి : టిడిపి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన చమర్తి జగన్‌మోహన్‌రాజు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్ కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన జగన్మోహన్‌రాజుకు అభినందనలు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో టిడిపి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వీరబల్లె టిడిపి మండల అధ్యక్షులు బానుగోపాల్ రాజు, టిడిపి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి రమణారెడ్డి టిడిపి నాయకులు, పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డిని కలిసిన 'చమర్తి'

మాస్టర్ హెల్త్ చెకప్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ శివప్రసాద్

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కలికిరి

కపిలేశ్వర హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాస్టర్ హెల్త్ చెకప్ కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు వైద్యులు శివప్రసాద్ తెలిపారు. కపిలేశ్వర హాస్పిటల్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన మాస్టర్ హెల్త్ చెకప్ కార్యక్రమానికి 30 మంది పేషెంట్లు పాల్గొని పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా 8000 వేలు రూపాయలు విలువ చేసే వివిధ రకాల పరీక్షలు రూ.3200లకే తక్కువ ధరలతో సుమారు 20 రకాల వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారని, ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేసుకున్నందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎముకల వైద్యులు హిమ బిందు, డాక్టర్ సాయి కృష్ణ రేడియాలజీ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, కపిలేశ్వర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ప్రసాద్

ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఫ్రెషెర్స్‌డే వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.భాస్కర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు జి.రామచంద్రరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడంలో తమ కళాశాల ముందుంటుందని స్పష్టం చేశారు. విద్యతోపాటు విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తమ అభిరుచి గల రంగాన్ని ఎంచుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రేషర్స్ డే వేడుకలను విజయవంతం చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్, అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీచే ఎస్‌పిఎస్ ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి-కలికిరి

రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిచే ఎస్‌పిఎస్ హాస్పిటల్ ప్రారంభించనున్నట్లు డాక్టర్ షేక్ మొహమ్మద్ వాసిం, డాక్టర్ షేక్ సిమ్రాన్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో మల్టీ స్పెషాలిటీ సౌకర్యాలతో, విదేశీ స్థాయి వైద్యనిపుల సేవలు, అత్యాధునిక పరికరాలతో ఎస్పి ఎస్ హాస్పిటల్ లో మల్టీస్పెషల్టి సౌకర్యాలు అందిస్తుందని చెప్పారు. అనుభవజ్ఞులైన వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని, షుగర్, బీపీ, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, తీవ్ర జ్వరములు, థైరాయిడ్, గుండె వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, దగ్గు, కామెర్లు, పక్షవాతం, ఫైల్స్, ఫిస్టులా, హెర్నియా, అపెండిక్స్ మొదలగు వైద్య సేవలతో పాటు చిన్న పిల్లలు, గర్భిణీలు మరియు దీర్ఘకాలిక రోగుల కు వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తారని ఈ కార్యక్రమానికి ప్రజలందరూ హాజరై విజయ వంతం చేయాలని కోరారు.

శ్రీకృష్ణదేవరాయులు విగ్రహనికి నివాళి అర్పిస్తున్న శ్రీనివాసరాజు

ఘనంగా శ్రీకృష్ణ దేవరాయలు వర్ధంతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతి సందర్భంగా డిఆర్‌డిఎ మాజీ రాష్ట్ర అధికారి యల్లటూరు శ్రీనివాస్ రాజు మంగళవారం పాత బస్టాండ్ కూడలిలో గల శ్రీకృష్ణదేవరాయలు విగ్రహా నికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభాషలందు తెలుగు లెస్స అని రాయలసీమను రతనాల సీమగా మార్చిన మహారాజు రాయలవారు అని కొనియాడారు. దక్షిణ భారత దేశం మొత్తాన్ని పరిపాలన చేసిన హంపి విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అని సాగించారు. ఆయన ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచే ధీర దిగ్గజమన్నారు. జనసేన కార్యకర్తలు, నాయకులతో కలిసి జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు కార్యక్రమంలో రాజంపేట నాయకులు శింగంశెట్టి నరేంద్ర, మాజీ జడ్‌టిసి యల్లటూరు శివరామరాజు, ఆకుల చలపతి, పివిఆర్ కుమార్, ఇడిమడకల రామా, పత్తి నారాయణ పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పేదలకు కొండంత అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తోందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటిలోని వైఎస్‌ఆర్ సిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన పదిమంది లబ్దిదారులకు రూ.13.20 లక్షలు విలువ చేసే చెక్కులను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో అందుబాటులో లేని వ్యాధులకు సిఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని అన్నారు. అభాగ్యులకు సిఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మండల బిసి నాయకుడు పల్లపురమేష్, ఫయాజ్ అహమ్మద్, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై సమీక్ష

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనుల పురోగతిపై 15 మండలాల ఎంఇఒలు, ఫీల్డ్ ఇంజినీర్లతో డిఇఒ శ్రీరామ్ పురుషోత్తం బుధవారం మదనపల్లె ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా నాడు-నేడు కో-ఆర్డినేటం, జిల్లా సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి జి.కరుణాకర్ ఒక సంయుక్త ప్రక టనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభయ్యే ఈ సమీక్షా సమావేశానికి పూర్వ చిత్తూరు జిల్లాకు చెందిన 15 మండలాల ఎంఇఒలు, సమగ్ర నివేదికలతో హాజరు కావాలని కోరారు. అదనపు తరగతి గదుల నిర్మాణం జరుగుతున్న అంగన్వాడీలు, సిడిపిఒలు కూడా హాజరు కావాలన్నారు.

వేసవిని తలపిస్తున్న భానుడి భగభగలు

- ఉక్కపోతతో అల్లాడుతున్న జనం

ప్రజాశక్తి-పుల్లంపేట

భానుడి భగభగతో ప్రజలు అల్లాడుతున్నారు. మండలంలో కాస్తున్న ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. మండుతున్న ఎండలకు జనం బెంబేలెత్తుతున్నారు. గత రెండు వారాలుగా ఎండలు మండిపోతున్నాయి. ఎండ తాకిడికి పలు గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంది. మండలంలో ప్రస్తుతం 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణంగా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కురిసే వర్షాలతో వాతావరణం చల్లబడాలని కానీ ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ప్రజలు చర్చించు కుంటు న్నారు. అక్టోబర్ రెండో వారంలోనే మండు వేసవిని ఎండలు తలపిస్తున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సూర్యుడు మండుతున్నాడు. దీనికి తోడు వేడి గాలుల తీవ్రత సాయంత్రం వరకు కొనసాగుతుండడంతో జనజీవనంపై ప్రభావం పడుతుంది. ఓవైపు వరుణుడు ముఖం చాటేయడంతో పంట దిగుబడులపై ఎండల ప్రభావం ఉండవచ్చుననే అభిప్రాయం పలువురు రైతులు వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో కూడా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఎండలకు

ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న రెడ్డిపల్లి ప్రధానకూడలి

వ్యవసాయ కూలీలు అల్లాడుతున్నారు. మండలంలో రైతులు అరటి, బొప్పాయి తోటల్లో కలుపు తీతలు, తెగుళ్ల నివారణకు, మందులు పిచికారి చేసే పనుల్లో నిమగ్నమవుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు ఎండలకు తట్టుకోలేక తరచు చాలా గట్లపై సేదతీరుతున్నారు. మధ్యాహ్న వేళల్లో ఎండలకు భయ పడి జనం బయటకు రాకపోవడంతో పుల్లంపేట, రెడ్డిపల్లి తదితర గ్రామాలలో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

అపరిశుభ్రత ఆహారం.. తనిఖీలు మృగ్యం

కనీస జాగ్రత్తలు లేకుండానే పదార్థాల తయారీ
అనారోగ్యానికి గురవుతున్న భోజన ప్రియులు
పట్టని అధికారులు

ప్రజాశక్తి-కలకడ

హోటళ్ల యజమానులు అధిక ఆదాయానికి అలవాడు పడి నిబంధనలు పాటించడం లేదు. భోజన ప్రియుల జేబులతో పాటు ఆరోగ్యానికి చిల్లులు వేసుకుంటున్నారు. మండల కేంద్రమైన కలకడలో చాలావరకు హోటళ్లు వెలిశాయి. స్థానిక పోలీస్ యూ కాంప్లెక్స్‌లో హోటల్ ఏర్పాటు చేశారు. ఈహోటల్లో ప్లాస్టిక్ కవర్లను ఉపయోగిం చడం జరుగుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. టిఫిన్ భోజనాలు చేసే సమయంలో భోజనప్రియలకు ప్లాస్టిక్ కవర్లు వేసి భోజనాలు వడ్డించడం జరుగుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఉదయం పూట ఇడ్లీ తయారు చేసే సమయంలో మామూలుగా బియ్యపు పిండిని తడిబట్ట వేసి ఇడ్లీలను తయారుచేస్తారు. ఈ హోటళ్లో ప్లాస్టిక్ కవర్లలో ఇడ్లీ పిండి వేసి ఇడ్లీలను తయారు చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్లాస్టిక్‌లో మిలితమైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల శరీంలోని లివర్, గుండె, కాలేయము, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు లకు సంబంధించిన వ్యాధుల బారిన పడే అవకాశముందని చెబుతున్నారు. ఉదయం అల్పాహారం, భోజానాన్ని అధిక రేట్లతో విక్రయిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.సంబంధిత అధికారులు తనిఖీ చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఈ విషయంగా ఫుడ్ కమిషనర్ చర్యలు చేపట్టి ప్రభుత్వ నిబంధనలు పాటించని హోటళ్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇడ్లీ తయారీలో ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న నిర్వాహకులు

ప్లాస్టిక్ కవర్‌లో అల్పాహారం

ప్రజారోగ్యాన్ని కాపాడాలి

హోటళ్లలో నాణ్యమైన తిండి వడ్డించకుండా ప్లేట్లలో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. ఇడ్లీల తయారీలో ప్లాస్టిక్ కవర్లను వినియో గించడం వల్ల అనారోగ్యబారిన ప్రమాదముంది. అధికారులు చర్యలు తీసుకొని ప్రజారోగ్యాన్ని కాపాడాలి.

-దండు జిలానిబాషా

అధికారులు చర్యలు తీసుకోవాలి

ఫుడ్ కమిషన్ అధికారులు ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న హోటళ్లలో తనిఖీలు విస్తృతం చేయాలి. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్ వినియోగించే హోటళ్ల యజమానులపై చర్యలు తీసుకోవాలి.

- రెడ్డప్ప నాయుడు, కోనేనివాండ్లపల్లె

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

రామాపురం పోలీస్ స్టేషన్ వద్ద మానవహారం చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తిప్పేస్వామి ఆధ్వర్యంలో సచివాలయ మహిళా పోలీసుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ఉన్న గ్రామీణ ప్రాంతాలలో బాల్యవివాహాలను ప్రోత్సహించినా, సహకరించిన వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని తెలియపరచాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వివాహ వయసు రాకమునుపే పెళ్లిళ్లు చేయడం పరిపాటగా జరుగుతున్నదని, ఈ విషయాలను సంబంధిత వాలంటీర్లు, అంగన్వాడీ సిబ్బందితో చర్చించి సంబంధిత అధికారులకు దృష్టికి తీసుకరావాలన్నారు. డ్రగ్స్ వినియోగం, నాటుసారా తయారీ, అమ్మకాలు చేయడం గ్రామాలలో ఎక్కడైనా జరిగితే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. సైబర్‌నేరాలు, వరకట్న వేధింపులు, మహిళలపై గృహహింస అలాంటివి జరిగితే స్థానిక పోలీస్ పోలీస్‌స్టేషన్ దృష్టికి తీసుకరా వాల న్నారు. కార్య క్రమంలో సచివాలయ మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బంది, పాల్గొ న్నట్లు తెలిపారు.

రామాపురం : మండల సమాఖ్యా ఆధ్వ ర్యంలో సంఘసభ్యులకు బాల్య వివాహాలపై అవ గాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ఐసిడిఎస్ సిడిపిఒ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాల్య వివాహాలపై వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు, అంగన్వాడీ, సూప ర్వైజర్లు మహిళాసంఘాలు సిబ్బంది రామాపురం పోలీస్ స్టేషన్ నుంచి ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఎదురుగా మాన వహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడ పిల్లలకు 18 సంవ త్సరాల వరకు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండే వరకు వివాహాలు చెయ్యరాదానిఅన్నారు. బాల్య వివాహాలవల్ల శారీరక వికలత్వం, మానసిక ఎదుగుదల లేని పిల్లలు పుట్టే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం దేవసేన, సూపర్వైజర్లు పద్మజారాణి, సుజాతరెడ్డి, హుస్సేనమ్మ, ఐసిపిఆర్‌డి ఉషారాణి, ఆర్ఐ రవికుమార్. సిసిలు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగంతో రైతులకు లబ్ధి : జెడి

పంటకోత ప్రయోగం చేపట్టిన వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి-ములకలచెరువు

పంటకోత ప్రయోగంతో రైతుకు ముందుగానే దిగుబడి నిర్ధారణ తెలుస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. మండలంలోని కదిరినాథునికోట గ్రామానికి చెందిన రైతు టి. విశ్వేశ్వరరెడ్డి పొలాలలో పంటకోత ప్రయోగం చేపట్టారు. ఈ ప్రయోగాన్ని జిల్లా వ్యవసాయ అధికారం చంద్రనాయక్ పర్యవేక్షణ చేపట్టారు. ఎకరా పొలంలో 41కిలోల బరువు గల 17 బస్తాల పచ్చి వేరుశెనగ దిగుబడి వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకోత ప్రయోగం చేపట్టడం ద్వారా రైతులకు పంట దిగుబడి వివరాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఎఒ లీలకుమారి, సిబ్బంది అతశ్రీ అంజనేయులు, సుకుమార్, కృష్ణ పాల్గొన్నారు.

నగర పంచాయతీకి మూడు ట్రాక్టర్లు మంజూరు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీలో పారిశుధ్య పనుల అవసరార్థం, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఎంపీ నిధుల నుంచి మూడు ట్రాక్టర్లను మంజూరు చేశారు. వాటిని మంగళవారం బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయంలో ఎంపీ రిబ్బన్ కట్‌చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నగర పంచాయతీ ప్రజలకు సేవలు అందించడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర అమోఘమైందన్నారు. పట్టణంలో మెరుగైన పారిశుధ్యం కల్పించినప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు.ప్రజల శ్రేయస్సు కోసం అధిక ప్రాధాన్యత నిస్తున్నామన్నారు. నగర పంచాయతీ అభివృద్ధికి తగినన్ని నిధులు మంజూరు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి మరియు కమిషనర్ పి.ఆర్ మనోహర్, పలమనేరు నియోజకవర్గ వైసిపి పరిశీలకులు ఖలీల్ అహ్మద్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు మాలిక్ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీకి మంజూరు చేసిన ట్రాక్టర్లు

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పోరుమామిళ్ల టౌన్

పోరుమామిళ్ల పరిసర ప్రాంతాలలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం వల్ల సీజన్ వ్యాధులు అనేకం ప్రబలుతున్నాయని, ముఖ్యంగా డెంగీ పట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ అనేక వ్యాధులతో దాదాపుగా 250 నుండి 300 పైగా రోగులు రోజూ పోరుమామిళ్ల సామాజిక ఆసుపత్రికి వస్తూ ఉంటారని చెప్పారు. 30 శాతం మంది జ్వరాలతో వస్తుంటారని నిర్ధారించారు. 60-70 సంవత్సరాల వయసు గల రోగులు దాదాపుగా హైపర్ టెన్షన్, డయాబెటిస్‌తో బాధపడుతున్నట్లు ఆమె వివరించారు. ప్రస్తుతం పోరుమామిళ్ల సామాజిక ఆసుపత్రిలో డాక్టర్ వెంకట నాగేంద్ర డిడిఒ ఆధ్వర్యంలో వివిధ విభాగాలలో 8 మంది వైద్యులు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఇఎన్‌టి, ప్రిడియాటిక్, గైనిక్, జనరల్ డాక్టర్, ఆర్థోపెడిక్, డెంటల్ వంటి విభాగాలు స్పెషలిస్టులు ఉన్నట్లు తెలిపారు. ఎక్సరే సదు పాయం అందుబాటులో లేకపోవడం కొంత అసౌకర్యాన్ని గురవుతున్నట్లు తెలిపారు. ఇటీవల ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించిన, నూతన ఆసుపత్రి భవనాలలో అనేక రకాల ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి రానున్నట్లు తెలి పారు. సిబ్బంది కొరత కొంత ఉన్నట్లు తెలిపారు. ఒక సివిల్ సర్జన్ నియామకం, ఇతర సిబ్బంది పూర్తిస్థాయిలో అందు బాటులోకి వస్తారని అని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అనేక రకాల అవగాహన కార్యక్రమాలు అందిస్తూ గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అవసరాన్ని గురించి తెలియజేస్తున్నట్లు డాక్టర్ నాగలక్ష్మి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఖాళీలన్నింటిని భర్తీ చేయాలి : 'రూట'

కడప అర్బన్ : త్వరలో నిర్వహించనున్న డిఎస్‌సిలో ఉర్దూ మీడియం ఎస్‌జిటి స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ ఖాళీలన్నింటిని భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్, ఆంధ్ర ప్రదేశ్ (రూట ఏ పి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. 5 సంవత్సరాలుగా సరిపడ ఉపాధ్యాయులు లేక ఉర్దూ మీడియం విద్యార్థులు ఎంతో నష్ట పోయారని పేర్కొన్నారు. రాబోయే డీఎస్సీ లో మెరిట్ ఆధారంగా ఖాళీలన్నింటిని భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వేల సంఖ్యలో అభ్యర్థులు ఉర్దూ మీడియం డిఇడి / బిఇడి పూర్తి చేసి డిఎస్‌సి కోసం ఎదురు చూస్తున్నారని, వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి టీచర్ల ఖాళీలన్నింటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రూట వ్యవస్థాపకులు సయ్యద్ హిదాయతుల్లా, రూట డైరీ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీమ్ సాహెబ్, రాష్ట్ర నాయకులు సత్తార్ ఫైజి, సయ్యద్ సిరాజుద్దిన్, ముహమ్మద్ అయ్యుబ్, జిల్లా అధ్యక్షులు ముహమ్మద్ ఇర్షాద్ పాల్గొన్నాం

మదనపలి : సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని నీరుగట్టువారిపల్లె నందు వెలసిన శ్రీచౌడేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు మూడవరోజుకు చేరుకున్నాయి. మూడవరోజు అమ్మవారు వెండి కవచం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ఉప్పు రామచంద్ర ఆధ్వర్యంలో ఆలయ కమిటీ పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారికి పంచామృతా భిషేకం, అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, మహా మంగళ హారతులు తీర్థ ప్రసాద వినియోగం కొనసాగాయి. ఆలయ 27వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు భక్తులు తరలివచ్చి,తీర్థప్రసాదాలను స్వీకరించి,అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి ప్రభాకర్, కోశాధికారి రామిశెట్టి లోకేష్, గౌరవ అధ్యక్షులు మోడెం వెంకట్రమణ, గౌరవ ఉపాధ్యక్షులు మోడెం సిద్ధప్ప, నాగరాజు, టి.లక్ష్మీ నారాయణ, లక్ష్మీ ప్రింటర్స్ వెంకట్రమణ, చంద్రశేఖర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **నందలూరు :** మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవరోజు మంగళవారం గజలక్ష్మి దేవి అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం గ్రామ పురోహితులు బండాత్మకూర్ శివకుమార్ శర్మ, ఆలయఅర్చకులు చెరుకుముడి మృత్యుంజయశర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, చండీ పారాయణం నిర్వహించారు. సాయంత్రం మహిళలు సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శెట్టి ఉమ్మడిశెట్టి యంబలూరు నరసింహారావు, అధ్యక్ష, కార్యదర్శులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహ శ్రేష్టి, సెక్రెటరీ గెలివి నాగ సురేంద్రకుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహప్రసాద్, మంచి కంటినారాయణ, మహిళామండలి అధ్యక్ష, కార్యదర్శులు జయలక్ష్మి, చలపాటి మాధవి, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రాజంపేట పట్టణ పరిధిలోని మన్నూరులో వెలసిన ఉదయగిరి ఎల్లమ్మతల్లి భక్తులకు చంద్రఘంట అలంకారంలో దర్శనమిచ్చారు. దసరా పర్వదినం నేపథ్యంలో ప్రతిరోజూ అమ్మవారు ఒక్కో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. చంద్రఘంట అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారులు కొర్రపాటి నాగేంద్ర, మణికంఠలు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు, ప్రతి శుక్రవారం శ్రీచక్రానికి విశేషమైన అభిషేకాలు నిర్వహిస్తున్నారని.. భక్తాదులందరూ విరివిగా విచ్చేసి శ్రీచక్ర అభిషేకములో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు.

సెలవుల్లో పాఠశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-పుల్లంపేట

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 14వ తేది నుంచి 24వ తేది నుంచి వరకు భద్రాచలం ప్రకటించినట్లు పుల్లంపేట ఎంఇఒలు చక్రధర్‌రాజు, నాగ తిరుమలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా సెలవుల్లో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా పాఠశాలలు నిర్వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. పిల్లలను ఒంటరిగా ఎక్కడికి పంపించవద్దని సూచించారు. ప్రతి ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ ఆదేశాలకు పాటించాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు.

'జగనన్నకు చెబుతాం'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-ములకలచెరువు

స్థానిక సిఎల్‌ఆర్‌సి భవనంలో బుధవారం జరిగే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహశీల్దార్ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని ఎంపిపి, జడ్పిటిసి మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, సింగల్ విండో చైర్మన్, జిల్లా కార్యవర్గ సభ్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్ డైరెక్టర్లు పాల్గొనాలని ఆయన తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని అన్నీ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు మరియు పంచాయతి కార్యదర్శులు, విఆర్‌ఒలు, సచివాలయం సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

పేదలకు దుస్తులు అందిస్తున్న గుణయాదవ్

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-నందలూరు

అన్నమయ్య యువశక్తి సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పునగాని గుణయాదవ్ పుట్టినరోజు, ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా రాజంపేట పరిసర ప్రాంతాల్లో ఉన్న పేదలకు .చిన్నారు లకు నూతన వస్త్రాలను మంగళవారం అందించారు. అనంతరం నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం ఇనుకుర్తి గ్రామంలో ఉన్న కాంతమ్మ తల్లి ఆశ్రమంలో వృద్ధులకు రుచి కరమైన భోజనాలను, మాతృదేవోభవ వృద్ధాశ్రమం, అభయ క్షేత్రము వంటి ఆశ్రమాలలో అన్నదాన కార్యక్రమాలను పెద్ద ఎత్తున జరిపించినట్లు గుణయాదవ్ తెలిపారు.యువత అందరూ సేవాభావంతో మేలగాలని సమాజంలో నేటి యువత సాటివారికి సహకరించే గుణాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు శరత్ బాబు, కొండే శివాజీ, వినయ్, సుధా, మోహన్, సాయి, ప్రసాద్, అఖిల్ పాల్గొన్నారు.

గోపనపల్లిలో పొలంబడి

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గోపనపల్లి రైతు భరోసా కేంద్రంలో పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా రిసోర్స్ సెంటర్ వారిచే నిర్వహించారు. వేరుశనగ, ఉలవలు పంటలో తీసుకోవలసిన జాగ్రత్తలు సస్యరక్షణ చర్యలు గురించి డిఆర్‌సి ఎడిఎ శ్రీకాంత్, సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్ పీరుసాహెబ్, రైతుభరోసా కేంద్రంలో పనిచేస్తున్నటువంటి అగ్రికల్చర్ అసిస్టెంట్లలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.మురళీధర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-ములకలచెరువు

అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సిఐ మల్లిక తెలిపారు. సిఐ తెలిపిన కథనం మేరకు.. మంగళవారం పిటిఎం మండలంలోని జింకలమిట్ట క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో మండలం, కాట్నగల్లుకు చెందిన అంజి, శ్రీనివాసులను అదుపులోకి తీసుకున్నారు. వీరిని నుంచి 96 కర్ణాటక మద్యం పాకెట్లుతో పాటు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు సిఐపేర్కొన్నారు.